నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | మంగళవారం 4 జూన్ 2024 | MAHABUBABAD



వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

# నేడే ప్రజాతీర్పు

## వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- ఉదయం 8గంటలకు ప్రారంభం కానున్న లెక్కింపు
- మానుకోటలో 132 రౌండ్లు, 98 టేబుళ్లు
- వరంగల్‌లో 127 రౌండ్లు, 124 టేబుళ్లు
- తొలుత పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, సర్వీస్ ఓట్ల కౌంటింగ్
- లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత, 144 సెక్షన్



కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లు

*పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై నెలకొన్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలకు మే 13న ఎన్నికలు జరుగగా మంగళవారం ఓట్లను లెక్కించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలుకానుండగా వరంగల్ సెగ్మెంట్‌కు సంబంధించి ఎనుమాముల మార్కెట్‌లో, మానుకోటలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. వరంగల్‌లో 127 రౌండ్లు, 124 టేబుళ్లు.. మానుకోటలో మొత్తం 132 రౌండ్లు, 98 టేబుళ్ల ద్వారా లెక్కింపు జరుపనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, సర్వీస్ ఓట్లను లెక్కించనున్నారు.*

*- వరంగల్, మహబూబాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ)*

### తొలి ఫలితం వరంగల్ తూర్పు నుంచే

వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పోలింగ్ మే 13న జరగ్గా, మొత్తం 18,24,466 మంది ఓటర్లలో 12,56,310 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 68.86 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఓట్ల లెక్కింపు మంగళవారం జరుగనుంది. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల లెక్కింపు వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభం కానున్నట్లు ఆర్వో, కలెక్టర్ పీ ప్రావీణ్య తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓట్ల లెక్కింపు 124 టేబుళ్లపై 127 రౌండ్ల ద్వారా నిర్వహించనున్నారు. మొత్తం 42 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, సర్వీస్ ఓట్లను 18సీ గోదాములో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 14 టేబుళ్లపై లెక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. వరంగల్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు 17రౌండ్లు మాత్రమే ఉండటం వల్ల కౌంటింగ్ మొదట పూర్తి కానుంది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో 17 టేబుళ్ల ద్వారా 18, పాలకుర్తిలో 17 టేబుళ్ల ద్వారా 18, పరకాలలో 14 టేబుళ్ల ద్వారా 18, వరంగల్ పశ్చిమలో 14 టేబుళ్ల ద్వారా 18, వరంగల్ తూర్పులో 14 టేబుళ్ల ద్వారా 17, వర్ధన్నపేటలో 16 టేబుళ్ల ద్వారా 18, భూపాలపల్లిలో 18 టేబుళ్ల ద్వారా 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఎన్నికల సంఘం నియమించిన ఇద్దరు అబ్జర్వర్లు బండారి స్వాగత్ రణవీర్‌చంద్, రాజేశ్‌కుమార్ కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తారని వెల్లడించారు. పాస్‌లు ఉన్నవారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు.




### భద్రాచలంలో అత్యల్పంగా 13 రౌండ్లు




మానుకోట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని కౌంటింగ్ కేంద్రం

మహబూబాబాద్ లోక్‌సభకు సంబంధించి జిల్లాకేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,32,366 మంది ఓటర్లుండగా 11,01,030ఓట్లు(71.85%) పోలయ్యాయి. భద్రాచలం, పినపాక, ఇల్లెందు, ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్ అసెంబ్లీ స్థానాలకు వేర్వేరుగా కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం 132 రౌండ్లలో లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో 19 రౌండ్లు, మహబూబాబాద్-21, నర్సంపేట-21, ములుగు- 22, పినపాక -18, ఇల్లెందు -18, భద్రాచలం-13 రౌండ్లలో లెక్కించనున్నారు. అత్యధికంగా ములుగు అసెంబ్లీ నియోజకవర్గం 22 రౌండ్లు కాగా, భద్రాచలం అత్యల్పంగా 13 రౌండ్లు ఉన్నాయి. కౌంటింగ్ కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున మొత్తం 98 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో రౌండ్‌లో 98 ఈవీఎంలలో ఓట్లను కౌంటింగ్ చేయనున్నారు. పోలీసులు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. అధికారులు, వివిధ పార్టీలకు చెందిన ఏజెంట్లు, మీడియా ఇలా ఎవరైనా సరే పాస్ ఉంటేనే లోపలికి అనుమతించనున్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద ఇప్పటికే బందోబస్తు ఉన్నది. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి పాస్‌లు ఉన్న వారిని లోనికి అనుమతించనున్నారు.



జనగామలో జెండాకు వందనం చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య తదితరులు



మహబూబాబాద్‌లో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్సీ సత్యవతి, ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

# కేసీఆర్ వల్లే తెలంగాణ సుభిక్షం

## ఉమ్మడి జిల్లాలో ఘనంగా ఆవిర్భావోత్సవం

*బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయాల్లో జాతీయ పతాకంతో పాటు గులాబీ జెండాలను జిల్లా అధ్యక్షులు ఆవిష్కరించారు. అలాగే అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి ఉద్యమకారులకు సన్మానాలు చేశారు. అనంతరం దవాఖానలు, అనాథ శరణాలయాల్లో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఉద్యమనేత, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అలుపెరగని పోరాటం వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పదేళ్ల బీఆర్‌ఎస్ సర్కారు పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని పలువురు నేతలు పేర్కొన్నారు.*

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 3*

- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ముగింపు వేడుకలు
- జిల్లా కార్యాలయాల్లో జాతీయ జెండా, గులాబీ జెండాను ఆవిష్కరించిన నేతలు
- అమరవీరులకు నివాళులు, ఉద్యమకారులకు సన్మానాలు
- బీఆర్‌ఎస్ పాలన దేశానికే ఆదర్శమని వ్యాఖ్య

జనగామ జిల్లాకేంద్రం యశ్వంతాపూర్‌లోని జిల్లా కార్యాలయంలో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్ జెండాను, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పాల్గొన్నారు. తెలంగాణ కోసం ఆవిర్భవించిన పార్టీ బీఆర్‌ఎస్ అని, అధినేత కేసీఆర్ ప్రాణత్యాగానికి సిద్ధపడి రాష్ర్టాన్ని సాధించారని పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి ప్రజల సహకారంతో విశేష ప్రగతి సాధించి తెలంగాణను ముందువరుసలో నిలిపిన తీరును వారు గుర్తుచేశారు. హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో జాతీయ జెండాను మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, బీఆర్‌ఎస్ జెండాను జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆవిష్కరించారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి అధ్యక్షతన 1969 తెలంగాణ తొలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను సన్మానించారు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమ నేపథ్యం, సాగిన పోరాటంపై బీఆర్‌ఎస్ రూపొందించిన 30 నిమిషాల నిడివిగల డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జడ్పీ చైర్మన్, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నన్న పునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. మహబూబాబాద్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోత్ కవిత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, ఉద్యమకారులను శాలువాతో సన్మానించారు. ములుగులో జడ్పీ అధ్యక్షురాలు బడే నాగజ్యోతితో కలిసి జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళి అర్పించారు.



ములుగులో జెండాకు సెల్యూట్ చేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు, జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



హనుమకొండలో ఉద్యమకారులను సన్మానించి మాట్లాడుతున్న దాస్యం, బండా, పెద్ది, నన్నపునేని



హనుమకొండలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్సీ సారయ్య, దాస్యం, పెద్ది తదితరులు

# ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేరుస్తాం

### మంత్రి దనసరి సీతక్క

న్యూశాయంపేట, జూన్ 3 : తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేరుస్తామని, అమరుల ఆశయ సాధన కోసం సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హంటర్‌రోడ్‌లోని డీ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేయగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ అమరుల కుటుంబాలను గౌరవించుకుందామని, వారికి సముచిత స్థానం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఉద్యమకారులకు ఉద్యోగం, అమరవీరుల కుటుంబాలకు రూ.25వేల పెన్షన్ ఇస్తామని తెలిపారు. తెలంగాణ కోసం పార్లమెంట్‌లో కొట్లాడిన తీరు, జరిగిన పరిణామాలను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, ఎంపీ పసునూరి దయాకర్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకటస్వామి, గండ్ర సత్యనారాయణరావు, యశస్వినీరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్, కాజీపేట దర్గా పీఠాధిపతి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా, మేయర్ సుధారాణి, తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

# లోక్‌సభ ఓట్ల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు


**వరంగల్ లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీ ప్రావీణ్య**

**ఎనుమాముల మార్కెట్‌లో లెక్కింపు కేంద్రాలు, సిబ్బంది శిక్షణ పరిశీలన**

కాశీబుగ్గ, జూన్ 3: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.ప్రావీణ్య తెలిపారు. మార్కెట్ యార్డులో జరుగనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలను డీసీపీ రవీందర్, అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, సంధ్యారాణి, డీఆర్‌ఓ శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో సోమవారం తనిఖీ చేశారు. కౌంటింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మూడంచెల భద్రత ఉంటుందని, సిబ్బంది, పోలీస్ బందోబస్తు మొత్తం 2500 మంది సిబ్బంది పోలింగ్ ప్రక్రియలో పాల్గొంటారని తెలిపారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగనున్నందున టేబుల్స్ ఏర్పాటు, సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు, ఇన్‌చార్జిలకు నియోజకవర్గాల వారీగా శిక్షణ నిర్వహించి, రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించిన కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. 4వ తేదీ ఉదయం 6గంటలకు ఎన్నికల కౌంటింగ్ పరిశీలకుల సమక్షంలో తుది ర్యాండమైజేషన్ నిర్వహించి ఆయా కౌంటింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని, గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు, సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ సెంటర్‌లోకి అనుమతించేది లేదని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ రౌండ్ల వారీగా ఎన్‌కోర్‌లో ఫలితాలు అప్‌లోడ్ చేసేలా ఎన్‌కోర్ సిబ్బంది, ఐటీ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలను తెలియజేసే డిస్‌ప్లే

# ర్యాలీలు, సభలకు నో పర్మిషన్

### వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

కాశీబుగ్గ, జూన్ 3: వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఫలితాలు మంగళవారం వెలువడిన తర్వాత ర్యాలీలు, సభలు నిర్వహించుకునేందుకు ఎలాంటి అనుమతి లేదని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఓట్ల లెక్కింపు జరిగే వరంగల్ ఎనుమాముల మార్కెట్ ప్రాంగణంలో సోమవారం పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ పోలీస్ విభాగాలకు చెందిన 400 మంది పోలీస్ అధికారులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఎంపీ అభ్యర్థులు, సంబంధిత ఏజెంట్లు, పాస్‌లు ఉన్నవారికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఎలాంటి ర్యాలీలు, సభలకు అనుమతి లేదని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దని, ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు. డీసీపీలు రవీందర్, అబ్దుల్ బారీ, అదనపు డీసీపీ రవి, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు